క్లుప్తంగా

లక్ష్యానికి మించి పనులు కల్పించాలి

● డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి



కులుమాలలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ అమర్నాథ్ రెడ్డి

గోనెగండ్ల: కేటాయించిన లక్ష్యానికి మించి కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం మండలంలోని కులుమాల, చిన్నమరివీడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. రోజు వారి కూలీ ఎంత పడుతుంది. కొలతల ప్రకారం చేస్తున్నారా లేదా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నమరివీడు గ్రామంలో నారింజ పండ్ల తోటను పరిశీలించారు. గోనెగండ్లలో ఉపాధి కార్యాలయాన్ని తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్, ఈసీ ఉస్మాన్ బాషా, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు వీరేష్, వీరేష్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు

మద్దికెర : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందని జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం జెడ్పీటీసీని సచివాలయ, పంచాయతీ సిబ్బంది శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమలో ఇరిగేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు, కార్యదర్శి సుధాకర్, మాజీ ఎంపీపీ మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి

గోనెగండ్ల: రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని రాయలసీమ విద్యార్థి సంఘం, రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు కృష్ణ, నాగన్న, నల్లరెడ్డి, ఖాజా డిమాండ్ చేశారు. మంగళవారం గోనెగండ్ల మండలంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీమలో అపారమైన వనరులు ఉన్నా పాలకుల తప్పుడు విధానాలతో కరువు విలయ తాండవం చేస్తోందన్నారు. నిధులు, నీళ్ల నియామకాల్లో సమానవాట ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వీరన్న, రఘు తదితరులు పాల్గొన్నారు.


కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన

నందవరం: కనకవీడు గ్రామంలో సీఎస్ఐ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రాయలసీమ సీఎస్ఐ అధ్యక్షుడు ఫాదర్ పి. ఇస్సాక్ వరప్రసాద్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ మాట్లాడుతూ..యేసు సందేశాలను వినిపించారు. ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో డివిజనల్ చైర్మన్ చిన్నబాబు, పాస్టర్ ఐజాక్‌బాబు, వివిధ గ్రామాల పాస్టర్లు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

వెల్దుర్తి(కృష్ణగిరి):వాహనదారులురహదారి నిబంధనలు పాటిస్తూ ప్రయాణాలు సాగించాలని జిల్లా 108 వాహన మేనేజర్ నవీన్‌కుమార్ అన్నారు. పీస్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కర్నూలులోని అంబేడ్కర్ భవనంలో ఎమర్జెన్సీ కార్ డ్రైవర్లు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మంగళవారం వెల్దుర్తి 108 పైలెట్ ఉస్మాన్‌బాషాను ఆయన సన్మానించారు. జిల్లాలోని 50మంది డ్రైవర్లకు రోడ్డు సేఫ్టీపై ఒక్క శిక్షణ కార్యక్రమాన్ని రిసోర్స్ పర్సన్‌లు దురగయ్య, కొమపాల శ్రీనివాస్, జీవి కృష్ణుడు నిర్వహించారు. ప్రమాదం జరిగినప్పుడు ఎమర్జెన్సీ డ్రైవర్ల యొక్క అవసరం చాలా ముఖ్యమైనదని, గోల్డెన్ అవర్‌లో క్షతగాత్రుల ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. 108 వాహనాల ద్వారా రోజుకు ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్నారన్నారు. షేక్ ఉస్మాన్‌బాష ఈ 10ఏళ్లలో 15వేల మందిని కాపాడినందుకు భారత ప్రభుత్వం అవార్డు ఇచ్చి సత్కరించిందన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్

దేవనకొండ: విద్యార్థులు, యువకులు విజ్ఞానం పెంచుకునేందుకు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ అన్నారు. స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, మేధావులు, లైబ్రేరియన్ అశోక్ తదితరులతో సమావేశమయ్యారు. ప్రతి ఒక్కరు గ్రంథాలయంలో సభ్యత్వం నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో దేవనకొండ గ్రామ సర్పంచ్ మాలరంగమ్మ, జెడ్పీటీసీ రామకృష్ణ, మండల కన్వీనర్ మల్లికార్జున, ఆలూరు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాంభీమ్‌నాయుడు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు సమాయత్తం!

● ఆశలు రేకెత్తిస్తున్న వర్షాలు
● దుక్కుల్లో రైతన్నలు బిజీ
● సేవల్లో అధికార యంత్రాంగం
● పంపిణీకి విత్తనాలు సిద్ధం



ఎమ్మిగనూరులో ఊపందుకున్న వ్యవసాయపనులు



బావుల కింద పత్తి విత్తనాలు నాటుతున్న దృశ్యం

ఎమ్మిగనూరు: ఖరీఫ్ సాగుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు. ముందస్తు వర్షాలతో అన్నదాత మొహంలో ఆశలు చిగురిస్తున్నాయి. వారం రోజులుగా కురిసిన వానలకు రైతన్నలు పొలాలను దుక్కిదున్ని పంటసాగుకు సన్నద్ధం చేసుకుంటున్నారు. జూన్ 1నుంచి ఖరీఫ్ కాలం మొదలవుతున్నా ఇప్పటికే కొన్ని గ్రామల్లో బావులు, బోర్ల కింద ముందస్తు విత్తన సాగు చేపట్టారు.

పత్తిసాగుపైనే మొగ్గు

ఎమ్మిగనూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 65,854 హెక్టార్ల సాగు విస్తీర్ణం ఉంది. అయితే, ఈ ఏడాది 49,560 హెక్టార్ల వరకు పత్తిపంటనే సాగు చేసేందుకు రైతులు సిద్ధమైనట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. అటు పశువులకు గ్రాసం కొరత, ఇటు రైతన్నకు ఆదాయ పంటగా ఉండే వేరుశనగ పంటసాగు విస్తీర్ణం ఏటేటా తగ్గుతూ వస్తోంది.గతంలో 35వేల హెక్టార్లలో సాగయ్యే వేరుశనగ పంట నేడు 4,400 హెక్టార్లకు పడిపోయింది. సంప్రదాయ పంటలైన కొర్ర, సజ్జ, జొన్న, మినుములు, పెసర, అలసంద పంటలసాగును పెంచేందుకు అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

సబ్సిడీ విత్తనాల సరఫరా:

ఖరీఫ్ సీజన్‌కుగాను రైతులకు అవసరమైన విత్తనాలను సబ్సీడీపై అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలకు విత్తనాలు సరఫరా చేసింది. సబ్ డివిజన్ పరిధిలో వేరుశనగ 450 క్వింటాళ్లు ,కందులు 133 క్వింటాళ్లు, జీలగ 236 క్వింటాళ్లు, పిల్లిపెసర 90 క్వింటాళ్లు ఆర్బీకేలో అందుబాటులో ఉన్నాయి.

అందుబాటులో ఎరువులు

పంటసాగు మొదలైందంటే చాలు రైతులను దోచేందుకు ఎరువుల కంపెనీలు, వ్యాపారులు పోటీపడతారు. ప్రభుత్వం ఎన్ని ప్రకటనలు చేసినా..వ్యవసాయశాఖ హెచ్చరికలు జారీ చేసినా నకలీ మందులు, బయో ఉత్పత్తుల విక్రయాలు ఆగటంలేదు. ఇక వ్యాపారులు అదనుచూసి ధరలను అమాంతం పెంచేస్తారు. ఈ నేపథ్యంలో అధికారులు ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో యూరియా 626 టన్నులు, డీఏపీ 212 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 912 టన్నులు, ఎస్ఎస్‌పీ 52 టన్నులు అందుబాటులో ఉన్నాయి.

నకిలీలపై నిఘా

నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులపై వ్యవసాయశాఖ, విజిలెన్స్ శాఖలు నిరంతరం నిఘా ఉంచాయి.ఎరువులు,విత్తనాల షాపులను తనఖీలు చేస్తూ అక్రమార్కులో భయం పుట్టిస్తున్నారు. అధిక ధరలకు విత్తనాలు విక్రయించరాదని, ఇతర రకాలను కల్తీ చేయరాదని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే చర్యలు తీసుకొంటున్నారు.

రైతులకు మెరుగైన సేవలు



ఈఏడాది ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతాం. రైతులు కూడా విత్తనాలు, ఎరువుల ఎంపికపై అవగాహన పెంచుకోవాలి. రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీ విత్తనాలు,ఎరువులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. రైతులు పండించిన పత్తి విత్తనాలనే మెజార్టీ రైతులు కొంటున్నారు.వాటిని సీడ్ టెస్ట్ సెంటర్‌లో పరీక్షిస్తే బీటీ సామర్థం తెలుస్తోంది.ఎరువులు, విత్తన, ఫెస్టిసైడ్ వ్యాపారులతో సమావేశమై పలుసూచనలు,హెచ్చరికలు జారీ చేశాం.ఇప్పటి వరకు వ్యాపారులు దగ్గర ఉన్న కోటి రూపాయలు విలువ చేసే నాణ్యత లేని విత్తనాల విక్రయాలు నిలుపుదల చేశాం.

– మహ్మద్ ఖాద్రి, ఏడీఏ

రైతు నేస్తం

కౌలు రైతులను గుర్తించేందుకు సదస్సులు

కృష్ణగిరి: గ్రామాల్లో కౌలు రైతులను గుర్తించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని కోయిలకొండ, చిట్యాల గ్రామాల్లో మంగళవారం ఆయన కౌలు రైతుల సదస్సులు నిర్వహించారు. సెంటు భూమి లేకుండా కౌలుకు పొలాన్ని సాగు చేసే రైతులు కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే విచారించి కార్డులను మంజూరు చేస్తామని తెలిపారు.

ఆర్‌బీకేలో వేరుశనగ విత్తన రిజిస్ట్రేషన్

కృష్ణగిరి: ఈ ఖరీఫ్‌లో పంటలసాగుకు ప్రభుత్వం సబ్సిడీ కింద 3,099 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను మండలానికి కేటాయించినట్లు మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. త్వరలోనే రైతు భరోసా కేంద్రాలకు వాటిని తరలిస్తామని తెలిపారు. బుధవారం నుంచి విత్తనలు అవసరమైన రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వేరుశనగ క్వింటం పూర్తి ధర రూ.9,300 కాగా ఇందులో 40శాతం రూ. 3,720లు సబ్సిడీ పోను రైతు వాటా కింద రూ.5,580 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

శరవేగంగా ఆర్బీకేల నిర్మాణం

మద్దికెర : రైతులకు సత్వర సేవలు అందించడానికి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మద్దికెరలోని కెనరాబ్యాంకు సమీపంలో ఆర్బీకేతో పాటు వైఎస్సార్ విలేజ్ క్లినిక్ నిర్మిస్తున్నారు. దీనిని అతి త్వరలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా ప్రారంభింపజేయనున్నట్లు జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

పని చేయని వలంటీర్లను తొలగించండి



ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలును వివరిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

● మంత్రి గుమ్మనూరు జయరాం
● ములుగుందంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహణ

ఆస్పరి: గ్రామాల్లో సక్రమంగా పని చేయని వలంటీర్లను తొలగించాలని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఎంపీడీఓ రాధాను ఆదేశించారు. మంగళవారం మండలంలోని ములుగుందం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న అమలు చేస్తున్న పథకాలు అందుతున్నాయా లేదా అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి ఈ నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని వివరించారు. డ్రైనేజీ కాలువల నిర్మాణం కోసం అక్కడికక్కడే రూ. 20లక్షలు మంజూరు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. అందరికీ మేలు చేసే జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. తమది అభివృద్ధి మంత్రమని, ఓర్వలేక టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు చౌకబారు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారికి అవసరమైన సేవలు అందించాలని వలంటీర్లను నియమించామని, కొంత మంది సక్రమంగా పని చేయడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారు కైరుప్పలలో 15మంది, ములుగుందంలో 5 మంది ఉన్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓకు మంత్రి ఆదేశించారు. అంతకు ముందు కైరుప్పల గ్రామంలో కొత్తగా నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకేను మంత్రి, సర్పంచ్ తిమ్మక్క ప్రారంభించారు. అనంతరం ములుగుందం సచివాలయం ఉద్యోగులతో సమావేశమైన మంత్రి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. కార్యక్రమంలో దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, జెడ్పీటీసీ దొరబాబు, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, సొసైటీ చైర్మన్ గోవర్ధన, సీఈఓ అశోక్, ఏఓ మునెమ్మ, ఏఈ యమునప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య, నాయకులు సుంకర రామాంజినేయులు, వెంకన్న, ప్రభాకర్‌రెడ్డి, కరుణాకర్, యల్లప్ప, హనుమంతు, నాగరాజు, హనుమంతరెడ్డి, శివ, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయిలు

నందవరం : మండల పరిధిలోని హెచ్. బాపురంలో నీటి ఎద్దటి నివారణకు ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాముడు తెలిపారు. మంగళవారం బాపురం గ్రామం కుమ్మరి వీధిలో కుళాయి కనెక్షన్లకు పైపులైన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. జగనన్న నువ్వే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో గ్రామస్తులు తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి చొరవతో ఆ పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు నరహరి రెడ్డి, సర్పంచ్ భర్త తిమ్మప్ప, ఎంపీటీసీ భర్త కోతి ఈరన్న, చిన్నరాముడు, రాఘవేంద్ర, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఎంఆర్‌పీకే ఎరువులను విక్రయించాలి

ఎమ్మిగనూరురూరల్: రైతులకు ఎరువులను ఎంఆర్‌పీకే విక్రయించాలని ఏవో మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పంచముఖి ఎరువుల దుకాణంలో రికార్డులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ఎరువుల కొరత సృష్టించకుండా చూడాలన్నారు. ఎరువులు కొనుగోలు చేసే రైతుల నుంచి ఆధార్, సెల్ నెంబర్ తప్పనిసరగా తీసుకోవాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమ్మర్ క్యాంప్ ప్రారంభం

వెల్దుర్తి(కృష్ణగిరి):వెల్దుర్తిలోని గ్రంథాలయంలో సమ్మర్‌క్యాంపు ఏర్పాటు చేశారు. దీనిని మంగళవారం గ్రంథాలయ అధికారి కవితాబాయ్ ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యంగా పిల్లలకు విజ్ఞానాన్ని పెంచే పుస్తకాలు, కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

గోనెగండ్ల: మండలంలోని బి. అగ్రహారం గ్రామంలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని డిమాండ్ చేస్తూ గురువారం చేపట్టే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్‌వైఎస్ఎఫ్ నాయకుడు రామా నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఆదోని రోడ్డు పరిశీలన

హొళగుంద: అధ్వానంగా తయారైన హొళగుంద–ఆదోని రోడ్డును మంగళవారం ఆర్అండ్‌బీ ఏఈ రవి పరిశీలించారు. మండల కేంద్రానికి చెందిన కొందరు రహదారి సమస్యపై స్పందనలో ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఏఈ ఆదోని రోడ్డును పరిశీలించి స్పందన అర్జీదారులతో మాట్లాడారు. రహదారి పనులు వేగవంతానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

ముమ్మరంగా ఆధార్ అనుసంధానం

తుగ్గలి: జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ మండలంలో ముమ్మరంగా కొనసాగుతోంది. మండలంలో యాక్టివ్ జాబ్‌కార్డులు 16,903 ఉండగా వాటిలో 36,272 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. ఇప్పటి వరకు 36,113 మంది కూలీల జాబ్‌కార్డులకు సంబంధించి ఆధార్‌ను లింక్ చేశారు. ఇంకా 1400 మందికి సంబంధించి ఆధార్ అనుసంధానం చేయాల్సి ఉందని ఏపీఓ రామకృష్ణ తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాత కల్గిస్తే చర్యలే

కృష్ణగిరి: గ్రామాల్లో ఎవరైనా శాంతి భద్రలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని ఆగవేళి గ్రామ పరిధిలోని పి. కోటకొండ రైతులతో మంగళవారం ఆయన మాట్లాడారు. పొలాల గట్ల సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప పంతాలు, పట్టింపులకు పోరాదన్నారు.

ప్లాట్లకు నంబర్లు కేటాయింపు

మద్దికెర: మండల కేంద్రమైన మద్దికెరలో ఇల్లు లేని వారందరికీ ఇంటి స్థలాలు ఇవ్వడం జరుగుతుందని, అలాగే ప్లాట్లకు నంబర్లు కేటాయించి లబ్ధిదారులకు స్వాధీనం చేయడం జరుగుతుందని తహసీల్దార్ నాగరాజు అన్నారు. మంగళవారం స్థానిక కొండమ్మబావి వద్ద వున్న ప్లాట్ల స్థలాన్ని పరిశీలించారు.

గృహ నిర్మాణాల పరిశీలన

చిప్పగిరి: రామదుర్గం, నగరడోణ తదితర గ్రామాల్లో చేపట్టిన జగనన్న గృహ నిర్మాణాల ను ఎంపీడీఓ సుధాకర్ రాజు, తహసీల్దారు లక్ష్మీనారాయణ మంగళవారం పరిశీలించారు.ఏఈ భవ్య, ఏపీ ఎం నాగార్జున, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వసతులు కల్పించాలి

ఆలూరు రూరల్: సంఘటిత, అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు యజమానులు వేసవిలో ఎండతీవ్రత నుంచి రక్షణకు కనీస వసతులు కల్పించాలని ఆలూరు, పత్తికొండ నియోజక వర్గాల సహాయ కార్మిక అధికారిణి కనక లక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు.

రెగ్యులర్ డాక్టర్ నియామకం

హొళగుంద: హొళగుంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెగ్యులర్ వైద్యాధికారిణిగా బిందుమాధవిని నియమించారు. ఈమేరకు వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

28న ప్రమాణ స్వీకారం

ఆలూరు: స్థానిక వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఈనెల 28న గుమ్మనూరు నారాయణ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆలూరులోని యార్డులో జరిగే ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పాలకవర్గ సభ్యులు తరలిరావాలని జి. నారాయణ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం

నందవరం: వైఎస్సార్ బీమా పేదలకు వరమని వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేష్ అన్నారు. కొత్తకైరవాడి గ్రామంలో గత మూడు రోజుల క్రితం తెలుగు తిమ్మప్ప అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వైఎస్సార్ బీమా పథకం తక్షణ సాయం కింద నామినీ తెలుగు సోమప్పకు రూ.10 వేలు వెల్ఫేర్ అసిస్టెంట్ బ్రహ్మయ్య గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుల చేతుల మీదుగా అందజేశారు.

ఆధ్యాత్మికం

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి, పుట్లూరు, కంబాలపాడు, చిట్యాల గ్రామాల్లో వెలసిన భక్తుల ఆరాధ్య దైవాలు, కోరిన కొర్కెలు తీర్చే కల్పతరువులైన రేణకా ఎల్లమ్మ, మారెమ్మ అమ్మవార్ల దేవాలయాలు మంగళవారం భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవార్లకు బోణాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఆసౌకర్యాలు కలగకుండా ఆయా గ్రామాల ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

యల్లమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం ఇస్తున్న జెడ్పీటీసీ విరుపాక్షి

చిప్పగిరి: మండలంలోని తిమ్మపురం గ్రామంలో ఏర్పాటు చేస్తున్న యల్లమ్మ దేవాలయానికి జెడ్పీటీసీ విరుపాక్షి రూ. 30 వేలు విరాళం అందజేశారు. తిమ్మాపురం గ్రామస్తులు దాతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచి నాగేంద్ర, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

వలంటీర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుకు ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 19 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ నరసింహమూర్తి మంగళవారం తెలిపారు. 20 వతేదీ దరఖాస్తులు పరిశీలన జరుగుతుందని, 23 వతేదీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. 24 వతేదీ ఎంపికైన అభ్యర్థికి తెలియజేసి 26 వతేదీ నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. మరిన్న వివరాలకు ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

విన్నపం

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: నిబంధనలకు విరుద్ధంగా ముందుగానే అడ్మిషన్లకు శ్రీకారం చుట్టిన ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఎజాజ్ అహమ్మద్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. పట్టణంలోని మాచాని సోమప్ప ఇంగ్లిష్ మీడియం స్కూల్, శ్రీచైతన్య, నారాయణ, గుడ్‌బేస్, బాష్యం, గుడ్‌షప్పర్డ్ తదితర పాఠశాలలు నిబంధనలు పాటించడం లేదన్నారు.

క్రైం కార్నర్

ఇద్దరి తీవ్రగాయాలు

ఆలూరు రూరల్: బైక్ అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఇద్దరువ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. మంగళవారం తెల్లవారు జామున 3 గంటలకు ఆలూరు సమీపంలోని హైవే 167లో ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం విజయపుర జిల్లా కేంద్రానికి చెందిన బసవరాజ్, కొట్రేష్ అనే వ్యక్తులు ఆదోనికి బైక్‌పై బయలుదేరారు. మంగళవారం తెల్లవారు జామున ఆలూరు సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. గాయపడిన ఇద్దరిని ఆలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం బళ్లారి ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఎమ్మిగనూరురూరల్: బోడబండ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో పార్లపల్లి గ్రామానికి చెందిన కుమారి అనే వివాహిత మృతి చెందింది. దీనికి కారణమైన ద్విచక్రవాహనదారుడు షారూక్‌పై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ నిరంజన్‌రెడ్డి మంగళవారం రాత్రి తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

ఆలూరు రూరల్/హాలహర్వి: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న 288 కర్ణాటక మద్యాన్ని హాలహర్వి పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. ఎస్ఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం 8 గంటలకు ఆలూరు మండలం మొలగవల్లి గ్రామానికి చెందిన క్రిష్ణ, సుంకన్న అనే వ్యక్తులు స్కూటర్‌పై మూడు బాక్సుల కర్ణాటక మద్యం (288 టెట్రా ప్యాకెట్లు 90 ఎంఎల్) తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



హోసూరులో మహిళ సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

● గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం సర్పంచ్ నాగప్ప, పార్టీ నాయకులతో కలిసి ఆమె గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అర్హత ఉంటే చాలు పార్టీలు, కులాలు చూడకుండా ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. ఈ లబ్ధి పారదర్శకంగా జరగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని ఎమ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాసు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కారం నాగరాజు, అధికార ప్రతినిధి శ్రీరంగడు, నాయకులు మోహన్, శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యులు కేశప్ప, నెట్టేకల్లు, శాంతిరెడ్డి, నాగిరెడ్డి, ఎంపీడీఓ పార్థసారథి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రేపు మద్దికెరలో నిర్వహణ..

మద్దికెర : ఈనెల 18 నుంచి 20 వరకు మండల కేంద్రం మద్దికెర గ్రామంలో నిర్వహించే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పాల్గొంటారని జెడ్పీటీసీ మురళీధరరెడ్డి తెలిపారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ సా యంత్రం 4గంటల నుంచి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుంటారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

అవ్వా బాగున్నావా..

● ఇంటింటికెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించిన ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి



ఎమ్మిగనూరులో వృద్ధురాలిని పలకరిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: అవ్వా బాగున్నావా.. నెలనెలా పింఛన్ అందుతోందా...అక్కా మీ పిల్లలకు అమ్మఒడి వస్తుందా ఇలాంటి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్ మోహన్‌రెడ్డి ఆరా తీశారు. ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలు అడిగితెలుసుకున్నారు. మంగళవారం పట్టణంలోని 15వ వార్డులో గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఆ వార్డు కౌన్సిలర్ ఇషాక్‌తో కలిసి గడప గడపకు వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలకు నేరుగా సాయం అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. సీఎం సహకారంతో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పట్టణంలో ప్రతి వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. మంచినీరు, రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకొని పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు బుట్టారంగయ్య, రియాజ్‌అహమ్మద్, నజీర్‌అహమ్మద్, సునీల్‌కుమార్, యూకె రాజశేఖర్, వార్డు కౌన్సిలర్లు అమాన్, డిషేకేశవరెడ్డి,ఎంకే శివప్రసాద్, పలు వార్డు ఇన్‌చార్జ్‌లుపాల్గొన్నారు.

వెంకటగిరిలో..

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని వెంకటగిరి గ్రామంలో మంగళవారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు మరోసారి పట్టం కట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్, బుడ్డన్న, తాయన్న, తిమ్మప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, సోగనూరు భీమిరెడ్డి, రంగన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



మద్దికెరలో డెంగీ వ్యాధిపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

మద్దికెర: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలని ప్రభుత్వ వైద్యాధికారులు నగేష్, శ్రీలక్ష్మి అన్నారు. డెంగీ జాతీయ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ డెంగీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అలాగే ప్రజలు దోమ కాటు నుంచి రక్షించుకోడానికి దోమ తెరలు వాడాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాష, ల్యాబ్ టెక్నీషియన్ విజయ్ హెల్త్ అసిస్టెంట్ ప్రకాష్‌రావు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: డెంగీ వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మొలగవల్లి పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ చంద్రకళ అన్నారు. మంగళవారం మొలగవల్లి గ్రామంలో వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ వెంకటరమణ, ల్యాబ్ టెక్నీషియన్ పురుషోత్తం పాల్గొన్నారు.

నందవరం: జ్వరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రకాంత్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. సీహెచ్ఓ బలరాం, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.